నమస్తే తెలంగాణ
జనగామ
5 | గురువారం 20 జూన్ 2024 | JANAGAON

గడ్డు పరిస్థితి నుంచి గట్టెక్కినం

హనుమకొండ సబర్బన్, జూన్ 19: 2014 కంటె ముందు వ్యవసాయ రంగానికి గడ్డు పరిస్థితులుండె. నాలాంటి వాళ్లెందరో కరెంటు కష్టాలతో దాన్ని వదిలి ఇతర పనులు చూసుకున్నరు. నేను కూడా అదే పని చేద్దామనుకున్న. గప్పుడే తెలంగాణ వచ్చుడు కేసీఆర్ ముఖ్య మంత్రి అయ్యిండు. కొత్త రాష్ట్రం వచ్చింది గద చూద్దామనుకున్న. కేసీఆర్ ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొని ఎవుసానికి 24గంటల విద్యుత్ ఇచ్చిండు. దీంతో అయిదెకరాల్లో వేసుకునే నాట్లు పదెకరాలకు పెంచుకోగలిగినం. ఒక్క గుంట కూడా ఎండకుండా పంటలు పండించినం. పిల్లల్ని మంచిగ సదివిచ్చుకున్నం. ఆనాడు ఆ కరెంటు కొనకుంటే తెలంగాణ వచ్చిన దానికి అర్థం ఉండేది కాదు. ఇప్పటి ప్రభుత్వం కేసీఆర్‌ను బద్నాం చేసుడు సరికాదు. గొడ్లెన్ని సచ్చినయనేది కాదు ముఖ్యం. వడ్లెన్ని పండినయనేది కూడా ముఖ్యమే.

– పొలాటి గోపాల్‌రావు, రైతు, ఎల్కతుర్తి



కేసీఆర్ అచ్చినంకనే కరెంటు మంచిగైంది..

సారు ఆలోచనతోనే పవర్‌ఫుల్ తెలంగాణ

- అంతకుముందు అచ్చీరానీ కరెంటుతో ఆగమైనం
- అప్రకటిత కోతలతో పాలాల దగ్గరే రాత్రంతా జాగారం
- బీఆర్ఎస్ సర్కారుతో వ్యవసాయానికి రంది లేదు
- 24గంటల నిరంతర విద్యుత్‌తో పుష్కలంగా పంటలు
- మునుపటి కంటే ఎక్కువ పండిస్తున్నం
- ఎన్నడూ ఒక్క గుంట కూడా ఎండిపోలే
- ఇప్పుడు కేసీఆర్‌ను బదనాం చేయడం తగదు
- స్వరాష్ట్రానికి ముందు, తర్వాత విద్యుత్ పరిస్థితిపై రైతుల మనోగతం

'తెలంగాణ రాష్ట్రం రాకముందు వచ్చీరాని కరెంట్‌తో అరిగోసపడ్డం. ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియక ఎన్నో ఇబ్బందులు పడ్డం. ముఖ్యంగా పంటలకు నీళ్లు పెట్టేందుకు సకాలంలో కరంటు ఉండక వ్యవసాయం ఆగమైంది. రాత్రిపూట పాలాల దగ్గర జాగారం చేయాల్సి వచ్చేది. సాగునీళ్లు అందక పంటలు పండక ఎంతోమంది రైతులు అప్పులపాలై ప్రాణాలు తీసుకోవాల్సి వచ్చింది. ఇలా దారుణమైన, దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతుల జీవితాల్లో వెలుగులు నింపింది కేసీఆరే. స్వరాష్ట్రాన్ని సాధించడమే గాక ముందుచూపుతో 24గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేసి వ్యవసాయానికి రంది లేకుంట చేశిండు. ఆయన వచ్చినంకనే కరెంట్ మంచిగైంది' అంటూ రైతాంగం స్పష్టంచేస్తోంది. తెలంగాణ రాకముందు అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వ్యవస్థను మెరుగుపర్చి రంది లేకుండా చేశారని గుర్తుచేసుకున్నారు. ఇలా ఒక వ్యవసాయమే కాదు.. అన్ని రంగాలను గాడిన పెట్టి 'పవర్‌ఫుల్ తెలంగాణ'గా నిలబెట్టిన కేసీఆర్‌ను.. విద్యుత్ కొనుగోళ్ల విషయంలో బదనాం చేయడం తగదని మండిపడుతున్నారు.

- నమస్తే నెట్‌వర్క్, జూన్ 19

రాత్రిపూట బావుల కాడనే పండేది

రేగొండ, జూన్ 19 : 2014కు ముందు సాగునీటి కోసం బావుల వద్దనే పండేది. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలిసేది కాదు. వేళాపాల లేకుండా కోతలు ఉండేది. వచ్చిన కరెంట్ కూడా సక్రమంగా సరఫరా కాక మోటర్లు కాలిపోతుండె. కరెంట్ లేక, పంటలు చేతికిరాక అప్పులపాలై ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నరు. ఎవుసం చెయ్యలేక ఊర్లు ఇడ్చిపెట్టి పట్టణాలకు వలసలు పోయి కూలీ పనులకు పోయినం. తెలంగాణ అచ్చినంక అప్పటి సీఎం కేసీఆర్ రైతు బాధలు తెలుసుకొని 24 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడంతో ఏడాది పొడవునా మూడు పంటలు సాగు చేసినం. కేసీఆర్ పాలనలో ఎప్పుడు కూడా రాత్రి పూట పంటలకు సాగునీరు పెట్టిటోళ్లం కాదు. పగటి పూటనే మోటర్లు అన్‌చేసి నిర్భయంగా ఉండెటోళ్లం. అసొంటి కేసీఆర్‌ను కాంగ్రెసోళ్లు విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలు చేసిండంటూ నిందించడం సరైంది కాదు. వాళ్లు ఇప్పుడు అధికారంలోకి వచ్చినంక మళ్ల పాతరోజులు గుర్తుకు వస్తున్నయి. ఇప్పటికే ఎడాపెడా కోతలు విధిస్తున్నరు. కేసీఆర్ కన్నా కరెంటు మంచిగియ్యాల్సింది పోయి మాటలంటున్నరు.

– సామాల రాజిరెడ్డి, రైతు, రేగొండ

కరెంట్‌తో రాత్రంతా మేల్కొవాల్సి వస్తుంది

జనగామ చౌరస్తా : నా పేరు మంద రవి. నేను జనగామ మండలంలోని చౌడారం గ్రామంలో సొంతంగా మినీ రైస్ మిల్లును నడుపుతున్నాను. ఇంతకు ముందు 24 గంటల కరెంట్ ఉండేది. ఇప్పుడు రోజు అర్ధరాత్రి 12 గంటలకు కరెంట్ వచ్చి మరుసటి రోజు సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఆరు గంటలు కరెంట్ బంద్ చేస్తుండ్లు. దీంతో రైతులు మిల్లుకు తీసుకొచ్చిన వడ్లను రోజుకి ఐదు వందల బస్తాలను పట్టే నేను ఇవాళ మూడు వందల బస్తాలే పట్టగలుగుతున్నాను. దీంతో ఆర్థికంగా కొంత నష్టపోవడంతో పాటు రాత్రంతా మేల్కొనాల్సి వస్తున్నది. అనారోగ్య సమస్యలు కూడా ఎదురవుతున్నయి.

– మంద రవి, మినీ రైస్‌మిల్ యజమాని, చౌడారం

కరెంటిచ్చిన కేసీఆర్‌ను తప్ప పట్టడం అన్యాయం

చెన్నారావుపేట, జూన్ 19 : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ప్రజలకు 24 గంటల కరెంట్ ఇచ్చిన కేసీఆర్‌ను తప్పు పట్టడం నిజంగానే అన్యాయం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కరెంట్ కోసం ఎన్ని ఇబ్బందులు పడ్డమో ఇంకా గుర్తున్నది. నేను గత 14 ఏండ్లుగా చెన్నారావుపేట మండల కేంద్రంలో వెల్డింగ్ పని చేస్తున్న. పదేళ్లకు ముందు రోజులో 4 గంటలు మాత్రమే పని చేయడానికి కరెంట్ ఉండేది. అది రెండు దఫాలుగా వచ్చేది. మిగిలిన సమయమంతా ఖాళీగా కూసునే టోళ్లం. వచ్చీ రాని కరెంట్‌తో వెల్డింగ్ పని చేయలేక విసుగొచ్చేది. కానీ, కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మొదట విద్యుత్ వ్యవస్థ రూపమే మారిపోయింది. ఏం చేసినా సరే జనాలకు మాత్రం 24 గంటల కరెంట్ ఇచ్చిండు. కరెంట్ పోతదనే ఆలోచనే లేకుండా చేసిండు. అలాంటి కేసీఆర్ అవకతవకలకు పాల్పడ్డాడని నిలదీయడం దురదృష్టకరం. దూర దృష్టితో ఆలోచించి కేసీఆర్ రూపొందించిన విధానంతోనే తెలంగాణలో ఇప్పుడు కూడా 24 గంటల కరెంట్ వస్తున్నది. కేసీఆర్‌పై కక్ష సాధింపు రాజకీయాలు చేయడం ప్రభుత్వానికి మంచిది కాదు.

– వెంకటేశ్, వెల్డింగ్ షాప్, చెన్నారావుపేట

కరెంట్ ఇబ్బందులు లేకుండె..

నర్సింహులపేట, జూన్ 19 : యాసంగి పంటలకు సాగునీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేసీఆర్ ప్రభుత్వంలో గతేడాది మండుటెండలో సైతం చెరువు, కుంటల్లో నీరు నిండుగా ఉంది. దీనికి తోడు 24 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేశారు. ఇప్పుడు గాలివాన వచ్చిందంటే కరెంట్ పోతుంది. ఎప్పుడు వస్తుందో తెలువని పరిస్థితి నెలకొంది. గత యాసంగిలో కాల్వల ద్వారా సాగునీరు సక్రమంగా వదిలిపెట్టక పోవడంతో చెరువులు ఎండిపోయి నెర్రలు బారాయి. దీనికి తోడు 24 గంటల పాటు కరెంట్ ఇబ్బంది లేకుండా ఇచ్చిండ్రు. గత ఏడాది వానకాలంలో వేసిన మిరుప పంట బాగా దెబ్బ తిన్నది. మిరుప తీసేసి యాసంగి మక్కజొన్న, వరి పొలం సాగు చేసినం. నీళ్లు లేక పంటలు ఎండిపోయినయి. వారానికి ఒకసారి నీళ్లు వదిలి పెడితే కాలువ తడుసుడుకే సరిపోయింది. క్రేన్‌తో బావుల్లో లోతు తీసినం. అయినా నీళ్లు లేవు.

– అజ్మీరా శ్రీను, గోపతండా

గత ప్రభుత్వ కృషి ఫలితమే 24గంటల కరెంట్

గోవిందరావుపేట : గత కేసీఆర్ ప్రభుత్వ కృషితోనే 24 గంటల కరెంట్ తెలంగాణ రాష్ట్రంలో సాధ్యమైంది. ఈ కృషి వెనుక గత ప్రభుత్వ పట్టుదల ఎంతో ఉంది. తెలంగాణ రాక ముందు కరెంట్ ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెలిసేది కాదు. అలాంటి పరిస్థితుల నుంచి 24 గంటల కరెంట్‌ను చూసుడు కేసీఆర్‌తోనే సాధ్యమైంది.

– పున్నం అజయ్, మచ్చాపూర్

కాంగ్రెస్ తప్పుడు ప్రచారం నమ్మొద్దు

- బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు..
- కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తా
- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- మళ్లీ పాలకుర్తి నుంచే పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుస్తా..
- కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరిలోని తన నివాసంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి రూరల్, జూన్ 19: 'నేను పార్టీ మారుతానని కాంగ్రెస్ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దు.. బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తా'నని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టంచేశారు. బుధవారం వరంగల్ జిల్లా పర్వతగిరిలోని తన నివాసంలో పాలకుర్తి నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పార్లమెంట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలు చేయలేదని ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని తెలంగాణ రాష్ట్రానికి మళ్లీ కేసీఆరే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ పాలకుర్తి నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ చిన్న తప్పు చేయలేదన్నారు. తాను ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. సోషల్ మీడియా ప్రచారాన్ని నియోజకవర్గ ప్రజలు నమ్ముద్దని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఖండించాలన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందన్నారు. రైతుభరోసాకు దిక్కులేదని, పంట రుణమాఫీ అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఆసరా పింఛన్ల మొత్తాన్ని పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ నేతలు ఆచరణలో విఫలమయ్యారని ఎర్రబెల్లి మండిపడ్డారు. విద్యుత్ కోతలతో రాష్ట్రం చీకటి మయమైందని, శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని ధ్వజమెత్తారు. మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు నెలల పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందని ఎర్రబెల్లి ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్రలో ప్రజలకు మంచి చేసిన ఏకైక పార్టీ బీఆర్ఎస్, అధినేత కేసీఆర్ మాత్రమేనని కొనియాడారు. పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను, తప్పుడు పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

మేయర్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- ఆమెకు బడ్జెట్ సమావేశం నిర్వహించే అర్హత లేదు
- కమిషనర్‌కు బీఆర్ఎస్ కార్పొరేటర్ల ఫిర్యాదు
- కలెక్టర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయాలి

మేయర్‌పై కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

వరంగల్, జూన్ 19: 'బీఆర్ఎస్ టికెట్‌పై కార్పొరేటర్‌గా గెలిస్తే మేయర్‌గా ఎన్నుకున్నాం. ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరినందున స్థానిక సంస్థల పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ఆమె సభ్యత్వాన్ని రద్దు చేయాలి. బల్దియా బడ్జెట్ సమావేశం నిర్వహించే అర్హత గుండు సుధారాణికి లేదు' అని బీఆర్ఎస్ కార్పొరేటర్లు అన్నారు. ఈ మేరకు బుధవారం వారు కార్పొరేషన్‌లో కమిషనర్ అశ్విని తానాజీ వాకేడేను కలిసి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ అధ్యక్ష తన బల్దియా బడ్జెట్ సమావేశం నిర్వహించాలని కమిషనర్‌ను కోరారు.

అడ్డుకునేలా వ్యూహం

మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహిస్తే అడ్డుకునేలా బీఆర్ఎస్ కార్పొరేటర్లు వ్యూహం రచిస్తున్నారు. ఇప్పటికే గత ఆరు నెలలుగా సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా ప్రజా సమస్యలను గాలికి వదిలేయడంపై వారు గుర్రుగా ఉన్నారు. మేయర్ గుండు సుధారాణిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలనే దానిపై నిర్వహించిన సమావేశంలో ఇద్దరు బీజేపీ కార్పొరేటర్లు సైతం హాజరైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ కార్పొరేటర్లకు బీజేపీ వాళ్లు మద్దతు ఇస్తే బడ్జెట్ సమావేశం రసవత్తరంగా మారే అవకాశాలు ఉన్నాయి.

కటకటాల్లోకి ఖాకీచకుడు..

- మహిళా కానిస్టేబుల్‌పై లైంగిక దాడి
- బయటపడ్డ కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్ అఘాయిత్యం
- సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఉత్తర్వులు
- 14రోజుల రిమాండ్ విధించిన భూపాలపల్లి జడ్జి
- పరకాల సబ్ జైలుకు తరలింపు
- పోలీసు శాఖకు మచ్చ తెస్తున్న పలువురు ఖాకీలు

కాళేశ్వరం/సుబేదారి, జూన్ 19 : ప్రజలకు రక్షణగా నిలవాల్సిన పోలీసు అధికారి ఆ డిపార్ట్‌మెంట్ పరువు తీశాడు. తన స్టేషన్‌లో పని చేస్తున్న మహిళా కానిస్టేబుల్‌పై కన్నేశాడు. పథకం ప్రకారం ఇంటికి పిలిపించుకొని తన సర్వీస్ రివాల్వర్‌తో చంపుతానని భయపెట్టి తన కామవాంఛ తీర్చుకున్నాడు. అతడి బాగోతం బయటపడడంతో చివరికి కటకటాలపాలయ్యాడు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం అతడిని సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఆదేశాలిచ్చింది. ఇప్పటికే కొందరి అనైతిక వ్యవహారాలతో పోలీసు శాఖ అపకీర్తి మూటగట్టుకుంటుండగా తాజాగా కాళేశ్వరం ఘటనతో మరోసారి చర్చనీయాంశమైంది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఘటన వివరాలిలా ఉన్నాయి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న భవానీ సేన్ మహిళా హెడ్ కానిస్టేబుల్‌పై కన్నేశాడు. ఒకరోజు ఆమెకు ఫోన్ చేసి తాను ఇంట్లో జారి పడ్డానని, లేవలేకపోతున్నానని చెప్పడంతో ఆందోళనతో అక్కడికి వెళ్లగా తన సర్వీస్ రివాల్వర్ చూపించి బలాత్కరించాడు. అక్కడితో ఆగకుండా మరో రోజు రాత్రి కానిస్టేబుల్ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో వెళ్లి భయపెట్టి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెపితే చంపుతానంటూ బెదిరించాడు. ఐతే సదరు కానిస్టేబుల్ రెండు రోజుల క్రితం జిల్లా ఎస్పీని కలిసి జరిగినదంతా చెప్పడంతో మంగళవారం రాత్రి కాటారం డీఎస్పీ, సీఐలు కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విచారణ జరపడంతో వాస్తవమే అని తేలింది. ఇదే కాకుండా మరికొన్ని బయటకు వచ్చాయి. స్థానికంగా ఉండే చికెన్ సెంటర్ల నుంచి రోజూ బలవంతంగా చికెన్ తీసుకువెళ్లేవాడని, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసేవాడని తెలవడంతో భూపాలపల్లికి తీసుకొచ్చి విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో ఎస్సైని విధుల నుంచి తొలగిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. భవానీసేన్‌ను బుధవారం భూపాలపల్లి జూనియర్ సివిల్ కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి అఖిల 14 రోజుల రిమాండ్ విధించడంతో పోలీసులు పరకాల సబ్ జైలుకు తరలించారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో..

ఇటీవల వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో కొందరు అధికారుల రాసలీలలు వెలుగులోకి వచ్చాయి. ఏడాదిన్నర క్రితం గీసుగొండ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన రాయల వెంకటేశ్వర్లు, దామెర ఎస్సైగా పని చేసిన హరిప్రియ అనైతిక వ్యవహారం వెలుగులోకి రావడంతో ఇద్దరు ఒకే రోజు సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత ఓ మహిళా ఇన్‌స్పెక్టర్ ఇంటికి తోటి ఇన్‌స్పెక్టర్ రాగా, ఆమె భర్తకు అతడికి గొడవ జరిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు వరకు వెళ్లింది. అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పనిచేసిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న మహిళా ఎస్సైపై లైంగిక వేధింపులకు పాల్పడగా అతడిపై కేసు నమోదైంది. కేయూసీలో పనిచేసిన ఎస్సైలు సంపత్, అనిల్ లైంగిక వ్యవహారాలు కూడా హాట్ టాపిక్‌గా మారాయి. కొద్ది రోజుల క్రితం ఎస్ఐబీలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ తిరుమతి చింతగట్టు క్యాంపు ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌కు ఓ మహిళతో వచ్చాడనే ఆరోపణలు రాగా, కేయూసీ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. మహిళ ఉన్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో పోలీసులు విచారణ రిపోర్ట్‌ను ఉన్నతాధికారులకు నివేదించారు. కాగా, వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని చాలా మంది పోలీసు అధికారుల అనైతిక వ్యవహారాలు వెలుగులోకి రాకుండా ఉన్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇలాంటివి జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగింపు

ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ రంగనాథ్

జయశంకర్ భూపాలపల్లి. జూన్ 19(నమస్తే తెలంగాణ) : మహిళా కానిస్టేబుల్‌పై లైంగిక దాడికి పాల్పడిన కాళేశ్వరం ఎస్ఐ భవానీ సేన్‌ను సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు మల్టీజోన్-1 ఐజీ ఏ.వి రంగనాథ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కాళేశ్వరం పాత పోలీస్‌స్టేషన్ బిల్డింగ్ రెండో అంతస్తులో ఎస్ఐ, గ్రౌండ్ ఫ్లోర్‌లో మహిళా కానిస్టేబుల్ నివాసం ఉంటున్నారని, రెండుసార్లు మహిళా కానిస్టేబుల్‌ను బెదిరించి లైంగిక దాడి చేసినట్లు విచారణలో వెల్లడి కావడంతో ఎస్ఐపై యూ/ఎస్ 449, 376(2)(ఎ)(బి) 324, 506 ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావును ఎస్పీ కిరణ్ ఖరె విచారణ అధికారిగా నియమించగా నివేదిక ఆధారంగా ఎస్ఐని అరెస్టు చేశారని, బుధవారం భూపాలపల్లి ఫస్ట్ క్లాస్ అడిషనల్ జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచినట్లు ఐజీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎస్ఐ తన హోదాను అడ్డుపెట్టుకుని పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలను దిగజార్చేలా వ్యవహరించడంతో భవానీసేన్‌పై ఎలాంటి విచారణ లేకుండానే ఆర్టికల్-311 ప్రకారం సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు వెల్లడించారు.